VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ సోమవారం 10 ఆగస్టు 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 37

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


టీమ్‌ఇండియా బంగ్లాదేశ్ టూర్..

# నేడు సాగర్‌లో వరుణయాగం

## మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో నిర్వహణ.. పాల్గొననున్న సీఎం రేవంత్

**108 మంది రుత్వికులతో ప్రత్యేక క్రతువు**

**11 హోమగుండాలతో విజయవిహార్‌లో వైదిక కార్యక్రమం**

**కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పం**

రాష్ట్రంతోపాటు కృష్ణా, గోదావరి నదుల పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ సోమవారం నాగార్జునసాగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం వరుణయాగం నిర్వహించనుంది. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించనుండగా, సీఎం రేవంత్‌రెడ్డి ఈ యాగంలో పాల్గొంటారు. కృష్ణా, గోదావరి నదులకు స్థిరమైన ప్రవాహాలు రావాలని, జలాశయాలు, చెరువులు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, వ్యవసాయానికి సమృద్ధిగా నీరు అందాలని కోరుతూ ఈ యాగాన్ని నిర్వహిస్తున్నారు.



నల్లగొండ, జూన్ 9 : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితులు, ఆలయ సిద్ధాంతితో సంప్రదింపుల అనంతరం ఆగస్టు 10న వరుణయాగం నిర్వహించేందుకు ముహూర్తం నిర్ణయించారు. నాగార్జునసాగర్‌లోని పర్యాటక శాఖ అతిథి గృహం విజయవిహార్ ప్రాంగణంలో 11 హోమగుండాలను ఏర్పాటు చేస్తున్నారు. 108 మంది రుత్వికులు, అర్చకులు, వేదపండితులు రోజంతా ప్రత్యేక వైదిక క్రతువులు నిర్వహించనున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరుతారు. మధ్యాహ్నం 2.45 గంటలకు సాగర్ హిల్‌కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో

-మిగతా 2 లో..



# పెద్దన్నగా నేనున్నా

## 'పెద్ది' కుటుంబానికి కేసీఆర్ పరామర్శ

**భావోద్వేగంతో కన్నీరు పెట్టుకున్న భారాస అధినేత**

**రూ.2.25 కోట్ల ఆర్థికసాయం అందజేత**

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి లేరన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మీయుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి వరంగల్ జిల్లా నల్లబెల్లికి మధ్యాహ్నం 3.50 గంటలకు వచ్చారు. తొలుత పెద్ది చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పెద్ది భార్య స్వప్న, పిల్లలు, తల్లి అమృతమ్మ, అన్నదమ్ములు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వరంగల్, జూన్ 9 : వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబ సభ్యులను భారాస అధినేత కేసీఆర్ ఆదివారం పరామర్శించారు. పలువురు పార్టీ నాయకులతో కలిసి సుదర్శన్‌రెడ్డి స్వగ్రామమైన నల్లబెల్లికి సాయంత్రం 4 గంటల సమయంలో కేసీఆర్ చేరుకున్నారు. పెద్ది అమర్ రహే..అంటూ పార్టీ శ్రేణులు నినాదాలు చేస్తుండగా సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి కేసీఆర్ సహా ముఖ్య నాయకులు నివాళులర్పించారు. 40 నిమిషాల పాటు



# హిందూ సమాజ వ్యతిరేకిగా కాంగ్రెస్ ప్రభుత్వం

**కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్**

హైదరాబాద్, జూన్ 9 : ఎంఐఎం పార్టీకి భయపడి కాంగ్రెస్ ప్రభుత్వం హిందూ సమాజ వ్యతిరేకిగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆరోపించారు. బోనాల వేడుకల సందర్భంగా కుర్మగూడ మూడు గుడుల ఆలయంలో, మాదన్నపేట నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.."నగరంలో రంజాన్ పర్వదినాల నిర్వహణకు ప్రభుత్వం రూ. 33 కోట్ల నిధులు విడుదల చేసింది. అదే సమయంలో

-మిగతా 2 లో..

# నేరాల స్వరూపం మారుతోంది

**మావోయిజం ముగిసింది.. ఇక డ్రగ్స్, సైబర్, ఆర్థిక నేరాలే సమస్య**

**మీడియా సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్**

వరంగల్, జూన్ 9 : ఒకప్పుడు నక్సలైట్ల కదలికలు, కూంబింగ్ ఆపరేషన్లతో పోలీసులకు సవాల్‌గా ఉన్న తెలంగాణలో ఇప్పుడు నేరాల స్వరూపం పూర్తిగా మారుతోందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. మావోయిజం పూర్తిగా అంతరించిన నేపథ్యంలో డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, ఆర్థిక నేరాలే

-మిగతా 2 లో..





# బోనమెత్తిన పాతబస్తీ

పోతరాజు వేషధారణలో భక్తులు


# మిగిలింది నాలుగు రోజులే

**15 రోజుల్లో లోక్‌సభ పనిచేసింది 15.36 గంటలు మాత్రమే**

**ప్రతిపక్షాల పట్టుతో సందిగ్ధంలో ఎఫ్‌సీఆర్ఏ సహా కీలక బిల్లులు**

న్యూఢిల్లీ, జూన్ 9 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు చివరి అంకానికి చేరుకున్నాయి. తీవ్ర ఆందోళనల కారణంగా దాదాపుగా ఎలాంటి కార్యకలాపాలు చేపట్టకుండానే రెండు వారాల సమయం గడిచిపోయింది. ఈ సెషన్‌లో ఇక మిగిలింది కేవలం నాలుగు రోజులు మాత్రమే. ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు మధ్య ప్రతిష్టంభన తారస్థాయికి చేరడంతో సభా కార్యకలాపాలు

-మిగతా 2 లో..





# ప్రధాన న్యాయమూర్తులుగా నలుగురు జడ్జీలు

**సుప్రీం కొలీజియం సిఫార్సు**

న్యూఢిల్లీ, జూన్ 9 : నలుగురు న్యాయమూర్తులను వేర్వేరు రాష్ట్రాల హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని కొలిజీయం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. కొలీజియం ఈ నెల 6న సమావేశమై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తిగా పని చేస్తున్న వి.కామేశ్వర్‌రావును పాట్నా హైకోర్టు ప్రధాన

-మిగతా 2 లో..

# తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవం

**పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, రాష్ట్ర రోడ్‌మ్యాప్‌పై చర్చ**

**అమెరికాలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన**




రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కలేలో గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ, క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు.

హైదరాబాద్, జూన్ 9 : గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం, సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో

-మిగతా 2 లో..



# శ్రీశైలానికి తగ్గిన వరద

**ఆల్మట్టి, నారాయణపూర్‌లలో సైతం..**

శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం గణనీయంగా తగ్గిపోయింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 1,01,384 క్యూసెక్కులు జలాశయంలోకి వచ్చి చేరుతుండగా, జలాశయంలో నిల్వలు 181.05 టీఎంసీలకు చేరాయి. గరిష్ట నిల్వ సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా, మరో 34 టీఎంసీలు వచ్చి చేరితే జలాశయం నిండుతుంది. గత వారం రోజులుగా రోజుకు 20 టీఎంసీల వరకు వరద రాగా, ప్రస్తుతం రోజుకు 10 టీఎంసీలకు తగ్గిపోయింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 8,000 క్యూసెక్కులు, హంద్రినీవా ద్వారా 2,500 క్యూసెక్కులు, కుడి విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ద్వారా 4,563 క్యూసెక్కుల నీటిని వాడుకుంటోంది.

హైదరాబాద్, జూన్ 9 : తెలంగాణ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 2,400 క్యూసెక్కులు కలిపి మొత్తం 17,463 క్యూసెక్కు నీటిని వాడుకుంటున్నాయి. ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయినీ, జూరాల నుంచి వస్తున్న వరద సైతం గణనీయంగా తగ్గిపోయింది. సోమవారం నాటికి జలాశయానికి ఇన్‌ఫ్లో 44వేల క్యూసెక్కులకు తగ్గిపోనున్నాయి. జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న నీటిని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలు వాడుకుంటుండడంతో ప్రస్తుత పరిస్థితుల్లో జలాశయం నిండే సూచనలు కనిపించడం లేదు. కర్ణాటకలోని

-మిగతా 2 లో..



## శ్రీశైలానికి తగ్గిన వరద

(మొదటిపేజీ తరువాయి)

ఆల్మట్టి జలాశయానికి 1,04,777 క్యూసెక్కుల వరద వస్తుండగా, దిగువన కృష్ణానదికి 42,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో నారాయణపూర్ జలాశయానికి 42,000 క్యూసెక్కుల వరద వస్తుండగా, 35,000 క్యూసెక్కుల నీటిని కిందికి విడుదల చేస్తున్నారు. దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టుకు 57,000 క్యూసెక్కుల వరద వస్తుండగా 44,279 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం ప్రాజెక్టులోకి విడుదల చేస్తున్నారు. శ్రీశైలంలో విద్యుదుత్పత్తి ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో నాగార్జునసాగర్‌లోకి 13,435 క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి.



## నేడు సాగర్‌లో వరుణయాగం

(మొదటిపేజీ తరువాయి)

ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి విజయవిహార్ ప్రాంగణంలో యాగం జరిగే ప్రాంతానికి చేరుకుంటారు. సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సాగర్‌లోనే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. విజయవిహార్ పరిసర ప్రాంతాల్లో పార్కింగ్, యాగశాల, వేదిక తదితర ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు పోలీసు, రెవెన్యూ, దేవాదాయ, నీటిపారుదల తదితర శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టారు.



## ప్రధాన న్యాయమూర్తులుగా నలుగురు జడ్జీలు

(మొదటిపేజీ తరువాయి)

న్యాయమూర్తిగా, బాంబే హైకోర్టులో జడ్జీగా పని చేస్తున్న జస్టిస్ రవీంద్ర వి.ఘుగేను కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ మహేష్ చంద్ర త్రిపాఠిని బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా, పంజాబ్--హరియాణా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అశ్వనీకుమార్ మిశ్రాను అదే కోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సూచించింది.

## మిగిలింది నాలుగు రోజులే

(మొదటిపేజీ తరువాయి)

సజావుగా సాగడం కష్టమేనని అంటున్నారు. పరీక్షల అక్రమాలు, పేపర్ లీకేజీలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల లాఠీచార్జి, పెల్లెట్ గన్స్ ప్రయోగంపై హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. అయోధ్య రామమందిర విరాళాల చోరీ అంశంపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే సభకు ఏ మంత్రి వచ్చి జవాబు చెప్పాలో ప్రతిపక్షాలు నిర్ణయించలేవని అధికార పక్షం తేల్చిచెప్పడంతో సభలో నిరసనల పర్వం కొనసాగుతోంది. నిరసనలు, నినాదాల నడుమ లోక్‌సభలో 8 బిల్లులకు ఆమోదముద్ర పడింది. లోక్‌సభకు కేటాయించిన మొత్తం 90 పనిగంటల్లో సరిగ్గా నడిచింది కేవలం 15 గంటల 36 నిమిషాలు మాత్రమే. ఈ సమయంలోనూ సింహభాగం, దాదాపుగా 11 గంటలు ఒక్క పరీక్షల అక్రమ మార్గాల నివారణ సవరణ బిల్లు'పై చర్చకే వెచ్చించారు. ఈ బిల్లుపై 48 మంది ఎంపీలు మాట్లాడారు. మిగిలిన 7 ఇతర ముఖ్యమైన బిల్లులను విపక్షాల నినాదాలు, ఆందోళనల మధ్య సమగ్ర చర్చ లేకుండా కేవలం 36 నిమిషాల వ్యవధిలోనే సభ ఆమోదించేసింది. రాజ్యసభ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. 15 రోజుల్లో ఎగువ సభ కేవలం 24.21 గంటలు మాత్రమే సమావేశమైంది. ఈ చివరి నాలుగు రోజుల్లో మరో 7 కీలక బిల్లులను ఆమోదింపజేసుకోవాలని కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లు, ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు, 'గనులు--ఖనిజాల అభివృద్ధి సవరణ బిల్లు, 'నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బిల్లు, 'కేరళ పేరు మార్పు బిల్లు'ప్రవేశపెట్టేందుకు సిద్ధంగా ఉంది. రాజ్యసభలో 'బ్యాంకర్స్ బుక్స్ ఎవిడెన్స్ బిల్లు', 'పన్నుల సవరణ బిల్లు'లను ఆమోదింపజేసుకోవాలని భావిస్తోంది. కీలక బిల్లులేవీ సోమవారం సభలో ప్రవేశపెట్టే అవకాశం లేదు. ముఖ్యంగాఎఫ్‌సీఆర్ఏ బిల్లును అనుమతించేదే లేదంటూ కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది. 10, 11, 12వ తేదీల్లో సభకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ కాంగ్రెస్ తమ ఎంపీలకు విప్ కూడా జారీ చేసింది.

# పెద్దన్నగా నేనున్నా

(మొదటిపేజీ తరువాయి)

అక్కడే గడిపిన కేసీఆర్.. సుదర్శన్‌రెడ్డి తల్లి అమృతమ్మ, భార్య స్వప్న, కుమారుడు నిదర్శన్‌రెడ్డి, కుమార్తె ధర్మిష్ఠ సహా కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఇప్పటికే ప్రకటించిన రూ.2.25 కోట్ల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులపై అక్కడే సంతకాలు చేశారు. సుదర్శన్‌రెడ్డి పిల్లలిద్దరికీ చెరో రూ.కోటి, తల్లికి రూ.25 లక్షల చెక్కు అందజేశారు. ఇంట్లో గోడలపై తెలంగాణ ఉద్యమ ఘట్టాలకు సంబంధించిన చిత్రాలను వీక్షించారు. పెద్ది భౌతికంగా మాత్రమే మన మధ్య లేడని.. ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందవద్దని చెప్పారు. పిల్లలను దగ్గరకు తీసుకుని మాట్లాడే సమయంలో కేసీఆర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. మిగతా నాయకులు కూడా భావోద్వేగానికి గురవడంతో వెంటనే తేరుకున్న కేసీఆర్ పిల్లలకు తండ్రిలేని లోటు రాకుండా చూసుకోవాలని సుదర్శన్‌రెడ్డి సోదరులతో చెప్పారు.



### అధినేత వెంట ర్యాలీగా..

ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి పార్టీ ముఖ్య నాయకులతో కలిసి వాహనశ్రేణిలో బయలుదేరిన కేసీఆర్‌కు దారిపొడవునా కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. వాహనాల్లో అధినేతను అనుసరించి నల్లబెల్లి వరకు ర్యాలీగా వచ్చారు. రాజ్యసభలో భారాస పక్ష నేత వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, శంభీపూర్ రాజు, యాదవరెడ్డి, శేరి సుభాశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, అనిల్‌జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్‌కుమార్, జోగినపల్లి సంతోష్‌కుమార్, మాలోత్ కవిత తదితర నాయకులు పాల్గొన్నారు.

### భారీగా తరలొచ్చిన పార్టీ శ్రేణులు

నల్లబెల్లికి కేసీఆర్ వస్తున్నారనే సమాచారంతో గులాబీ శ్రేణులు భారీ సంఖ్యలో పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు. వీరిని నియంత్రించడం పోలీసులు, పార్టీ వాలంటీర్ల తరం కాలేదు. కేసీఆర్ వాహనం జనంలో చిక్కుకుపోయింది. నేరుగా ఇంటి గుమ్మం వరకు వాహనాన్ని తీసుకెళ్లగా అక్కడ ఆయన దిగి నేరుగా ఇంట్లోకి వెళ్లిపోయారు. పరామర్శ అనంతరం భవనం పైనుంచి కార్యకర్తలకు అభివాదం చేశారు. కేసీఆర్ వెంట వాహనాల్లో వచ్చిన నాయకులు జనాన్ని దాటుకొని సుదర్శన్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లలేక బయటనే ఉండిపోయారు. కార్యకర్తలు, అభిమానులు ఇంట్లోకి చొచ్చుకొని వచ్చేందుకు ప్రయత్నించే క్రమంలో తోపులాట జరిగింది. తక్కువ సంఖ్యలో పోలీసులు విధుల్లో ఉండటం వల్ల రద్దీ నియంత్రణ కష్టమైందని పార్టీ కార్యకర్తలు పేర్కొన్నారు.

## బోనమెత్తిన పాతబస్తీ

### పోతరాజు వేషధారణలో భక్తులు



**హైదరాబాద్, జూన్ 9:** లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 118వ బోనాల జాతర ఉత్సవాలు ఆదివారం కనుల పండువగా కొనసాగాయి. మహిళా భక్తులు సంప్రదాయ వస్త్రధారణతో బోనాలను తీసుకురాగా....యువకులు పోతరాజు వేషధారణలో భక్తులను విశేషంగా అలరించారు. శివసత్తుల చిందులతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. జోగినీలు మెట్ల బోనాలతో నృత్యాలు చేస్తూ ముందుకు కదిలారు. తెల్లవారుజామున 3 గంటలకు జల్లి కదువా, 4 గంటలకు బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 5.30 గంటలకు మాజీ మంత్రి టి.దేవేందర్ గౌడ్ తనయుడు వీరేందర్ గౌడ్ దంపతులు అమ్మవారికి దేవి మహాభిషేకాన్ని నిర్వహించి మొదటి బోనం సమర్పించారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైన బోనాల సమర్పణ సాయంత్రం వరకు కొనసాగింది. బోనాలతో పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు పట్టు వస్త్రాలు సమర్పించగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ బంగారు బోనం సమర్పించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, దానం నాగేందర్, పైడి రాకేష్ రెడ్డి, రాజ్ ఠాకూర్, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల, సినీ నటులు విజయ్ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ, బేబి సినిమా ఫేం వైష్ణవి చైతన్య, దర్శకుడు వంగ సందీప్ రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మహిళా కమిషన్ చైర్ పర్సన్ గద్వాల విజయ లక్ష్మీ, బీసీ కమిషన్ సలహాదారుడు వి.హనుమంతరావు, మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, తలసాని సాయికిరణ్ యాదవ్, నగర పోలీస్ కమిషనర్ వీ.సీ.సజ్జనార్ అమ్మవారిని దర్శించుకున్నారు.

## నేరాల స్వరూపం మారుతోంది

(మొదటిపేజీ తరువాయి)

కొత్త సవాళ్లుగా మారాయని చెప్పారు. టీ-ఈగల్ ఫోర్స్, సీసీటీఎన్, ట్రాఫిక్, సీఐడీ, సైబర్ క్రైం తదితర విభాగాలకు చెందిన అధికారులతో కలిసి బృందంగా జిల్లాల పర్యటన చేస్తున్నామన్న ఆయన.. డ్రగ్స్, ఆర్థిక నేరగాళ్లపై మరింత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఆదివారం వరంగల్ నిట్‌లో అధికారులతో సమీక్షించిన అనంతరం డీజీపీ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సైబర్ నేరాల బారినపడి ప్రజలు సుమారు రూ.1,750 కోట్లు నష్టపోయారని చెప్పారు. అయితే ఈ తరహా నేరాల అదుపులో తెలంగాణ దేశంలోనే ముందంజలో ఉందన్నారు. పట్టణాలకే పరిమితమైన మత్తు పదార్థాలు ఇప్పుడు గ్రామాలకూ చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్ పెడ్లర్లు చిన్న పిల్లలను సైతం మత్తుకు బానిసలుగా మారుస్తున్నారని, విద్యాసంస్థల్లో డ్రగ్స్ తీసుకునే వారిని గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. నక్సల్ బాధిత కుటుంబాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు 'టీజీ వీర్'అప్లికేషన్ ప్రారంభించామని చెప్పారు. మావోయిస్టులు గంజాయికి వ్యతిరేకంగా ఉండేవారని డీజీపీ పేర్కొన్నారు. వారు ఉన్న సమయంలో గంజాయి సరఫరా చేసేందుకు ఎవరూ ధైర్యం చేసేవారు కాదని తాను చెప్పిన విషయాన్ని వక్రీకరించి, మావోయిస్టులకు



అనుకూలంగా మాట్లాడినట్లు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బ్యూరోను తీసుకురావడానికి చర్యలు జరుగుతున్నాయని చెప్పారు. నక్సల్స్ సమస్య ఉన్న సమయంలో రాజకీయ నేతలకు భద్రత కల్పించామని, ఇప్పుడు ఆ అవసరం తగ్గిన నేపథ్యంలో భద్రతను సమీక్షిస్తున్నామని డీజీపీ ఆనంద్ చెప్పారు. కొందరికి భద్రత తగ్గించామని, దీనిని రాజకీయ కోణంలో చూస్తూ రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తన కాన్వాయ్ మూడు వాహనాలకు తగ్గించుకున్నారని, తాను కూడా తన భద్రతను తగ్గించుకున్నానని డీజీపీ తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత, సీసీటీఎన్, టీ ఈగల్‌ఫోర్స్, సీఐడీ ఎస్పీలు రూపేశ్, సాయిశ్రీ, గిరిధర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.




## తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవం

(మొదటిపేజీ తరువాయి)

సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం--కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్--టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ ప్రతినిధులతో బర్క్లి కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం వెంట సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీజీఎం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## హిందూ సమాజ వ్యతిరేకిగా కాంగ్రెస్ ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

హిందువుల పండగ బోనాలకు కేవలం రూ.20 కోట్లే ఇచ్చి..అదే గొప్పని మంత్రులు వేదికలెక్కి ఉపన్యాసాలివ్వడం సరికాదు. బోనాల వేడుకలకు పాతనగరంలోని బస్తీల్లో ఎక్కడా పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్ల వసతులు చేపట్టకపోవడం అన్యాయం కాదా? ఇలాంటివి ప్రశ్నిస్తే మతచిచ్చు పెడుతున్నారని అంటున్నారు. ప్రభుత్వం అడుగడుగునా హిందువులను అణచివేసే పనులు చేస్తే ప్రశ్నిస్తూనే ఉంటా" అని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా భాజపా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాశ్‌చందర్‌జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే దొరకడం అదృష్టం.







- జాబ్ మేళా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి..
- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య..
- ఇందూరు యువత ప్రతిభకు అవకాశం కల్పించడం కోసం మెగా జాబ్ మేళా...
- ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ..

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే దొరకడం నిజామాబాద్ యువత అదృష్టమని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీరామ గార్డెన్ లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... ఇంత పెద్ద మొత్తంలో జాబ్ మేళా నిర్వహించటం అభినందనీయమన్నారు. రాజకీయంతో పాటు ప్రజల అభివృద్ధికి పాటుపడే వారు అరుదుగా ఉంటారన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నాలజీని వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కానీ అదే టెక్నాలజీకి వ్యసనం కాకూడదని సూచించారు. ఉద్యోగాలు రానివాళ్లు నిరాశ చెందకుండా మరింత ప్రయత్నించాలన్నారు. ప్రస్తుత ప్రయత్నాన్ని అనుభవంగా పొంది భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిదుకోవాలన్నారు.



అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ,



ఇందూరు యువతలో ఎంతో ప్రతిభ దాగి ఉంది, వారి ప్రతిభకు అవకాశం కల్పించడం కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఇందూరు భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తారని, తన బిడ్డ మంచి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలనేది వారి కోరిక అన్నారు. యువతకు ఉద్యోగం కల్పించడం అంటే కేవలం ఒక వ్యక్తికి ఉద్యోగం ఇవ్వడం కాదని ఒక కుటుంబానికి భరోసా ఇవ్వడం అని స్పష్టం చేశారు. యువతకు సరైన వేదిక దొరకడం లేదని ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని 70కి పైగా కంపెనీలను ఒకే వేదిక పైకి తీసుకోవచ్చామని తెలిపారు. ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు భయపడకుండా తమపై నమ్మకం పెట్టుకోవాలన్నారు. యువత ఉద్యోగాల కోసం తప్పనిసరిగా హైదరాబాద్ కు ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలన్నారు. నిజామాబాదులో అవకాశాలు పెరగాలని అదే తన లక్ష్యమని పేర్కొన్నారు.

నిజామాబాద్ ను ఐటీ హబ్ గా మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు ఇటీవల ఐటీ శాఖామంత్రి శ్రీధర్ బాబును కలిసి పలు ప్రతిపాదనలు అందజేయడం జరిగిందన్నారు. త్వరలోనే నిజామాబాద్ ను ఐటీ హబ్ గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యువతకు తోడుగా నిలుస్తామని చెప్పారు. జాబ్ మేళాకు సుమారు రెండున్నర వేలకుపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అనంతరం ఆయా కంపెనీలో ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, మఠం పవన్, శ్రవణ్, పసునూరి రాము, ప్రసూన శ్రీనివాస్, ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, బంటు రాము, బంటు ప్రీతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆఖర్లో సిరాజ్ హ్యాట్రిక్ సిక్సర్లు..

## వార్మప్ మ్యాచ్‌లో భారత్ విజయం





**కొలంబో:** శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌కు ముందు టీమ్ఇండియా ప్లేయర్లకు మంచి ప్రాక్టీస్ లభించింది. శ్రీలంక ఎలెవన్‌తో జరిగిన మూడు రోజుల వార్మప్ మ్యాచ్‌లో భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడోరోజు లంక జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 200/6 వద్ద డిక్లేర్ చేసి భారత్‌కు 206 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ టార్గెట్‌ని టీమ్ఇండియా 44.3 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ... డకౌటైన యశస్వి జైస్వాల్ (61 రిటైర్డ్ హర్ట్; 46 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులు) ఈ సారి అర్ధ శతకంతో మెరిశాడు. టీమ్ఇండియాకు ఊరటనిచ్చే విషయం ఏంటంటే.. చేతి వేలికి గాయం కారణంగా తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగని కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేశాడు. క్రీజులో సౌకర్యవంతంగా కనిపించిన గిల్ (44; 54 బంతుల్లో 7 ఫోర్లు) చక్కటి షాట్లు ఆడాడు. రిషభ్

# ఏ ఒక్కరినీ బలిపశువుగా చూపడం సరికాదు

## సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్



టీమ్ఇండియాలో గాయాల బెడద పెరుగుతున్న నేపథ్యంలో బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. ఆ విమర్శలపై సీఓఈ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ స్పందించాడు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను కేవలం ఒక పునరావాస నిర్వహణ కేంద్రంగా మాత్రమే చూడకూడదని, క్రికెటర్లు రాణించడానికి సహాయ పడటం కూడా తమ బాధ్యతలలో భాగమని పేర్కొన్నాడు. ఆదివారం బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా సీఓఈని సందర్శించిన అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడాడు.

"ఏ క్రీడాకారుడి కెరీర్‌లోనైనా గాయాలు సర్వసాధారణం. ఈ విషయంలో ఏ ఒక్క వ్యక్తిని గానీ, విభాగాన్ని గానీ బలిపశువుగా చూపడం సరికాదు. సీఓఈ, టీమ్ మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ సైన్స్ అండ్ మెడిసిన్ సిబ్బంది, సెలక్షన్ కమిటీ మధ్య సమన్వయం అద్భుతంగా ఉంది. ఆటగాడి ఫిట్‌నెస్ స్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు సెలక్షన్

# టీమ్ఇండియా బంగ్లాదేశ్ టూర్..

## కేంద్రం అనుమతి కోరనున్న బీసీసీఐ

టీమ్ఇండియా బంగ్లాదేశ్ పర్యటనపై ప్రతిష్టంభన ఇంకా కొనసాగుతోంది. గతేడాది భారత జట్టు బంగ్లా టూర్‌కు వెళ్లాల్సి ఉండగా.. బిజీ షెడ్యూల్ కారణంగా ఈ ఏడాదికి వాయిదా వేశారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 15 వరకు భారత్‌తో పరిమిత ఓవర్ల సిరీస్ కోసం బంగ్లాదేశ్ షెడ్యూల్ విండోను కేటాయించింది. ఇందులో మూడు వన్డేలు సెప్టెంబరు 1, 3, 6 తేదీల్లో.. మూడు టీ20లు 9, 12, 13 తేదీల్లో జరగాల్సి ఉంది. అయితే, కొన్నినెలల క్రితం ఇరుదేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు నెలకొనడంతో ఈ టూర్‌పై అనిశ్చితి నెలకొంది. ప్రస్తుత పరిస్థితుల్లో బోర్డు సొంతంగా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఈ విషయమై తాము త్వరలో భారత ప్రభుత్వాన్ని సంప్రదించనున్నట్లు బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు జాతీయ మీడియాకు వెల్లడించారు. ప్రతిపాదిత పరిమిత ఓవర్ల సిరీస్ గురించి బీసీబీ లేఖ రాసిందని ఆయన పేర్కొన్నారు. రెండు దేశాల క్రికెట్ బోర్డుల మధ్య నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నాయని, త్వరలో స్పష్టత వస్తుందని సదరు అధికారి తెలిపారు. బంగ్లాదేశ్ టూర్‌కు భారత ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్‌లో అఫ్గాన్‌తో భారత్ మూడు టీ20లు ఆడనుందని సమాచారం. ఈ మ్యాచ్‌లు సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగే అవకాశముంది. అంతేకాదు ఈ టూర్‌కు అఫ్గానిస్థాన్ ఆతిథ్యదేశంగా ఉంటుందని సమాచారం. ఈ సిరీస్ గానుక జరిగితే భారత గడ్డపై మ్యాచ్‌లకు ప్రత్యర్థి జట్టు అధికారికంగా ఆతిథ్య ఇవ్వడం ఇదే తొలిసారి అవుతుంది.


# ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ హైజంప్‌లో భారత్‌కు తొలి పతకం

## లాంగ్‌జంప్‌లో షానవాజ్‌కు కాంస్యం

ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్‌లో భారత్ చరిత్రాత్మక ఫలితాలు సాధిస్తోంది. శనివారం ఆశిష్ యాదవ్ పదేళ్ల తర్వాత జావెలిన్‌లో భారత్ తరఫున పతకం సాధిస్తే, ఆదివారం బసంత్ కుమార్ మేఘ్వాల్ చరిత్ర సృష్టించాడు. అతడు హైజంప్‌లో రజతం చేజిక్కించుకుని, ఈ టోర్నీలో ఈ విభాగంలో పతకం గెలిచిన తొలి భారతీయుడిగా రికార్డులకెక్కాడు. 19 ఏళ్ల బసంత్ ఉత్తమంగా 2.21 మీటర్ల ఎత్తు దూకి, రెండో స్థానంలో నిలిచాడు. యూన్స్ అయాచి (అల్జీరియా), ఓటిస్ పూల్ (బ్రిటన్) కూడా 2.21 మీటర్లే దూకి వరుసగా స్వర్ణం, కంచు పతకాలు నెగ్గారు. ఈ ముగ్గురూ 2.24 మీటర్లు దూకడంలో విఫలమయ్యారు. అయితే అంతకుముందు ఉత్తమ జంప్‌ను నమోదు చేయడానికి తీసుకున్న ప్రయత్నాల ఆధారంగా వారి స్థానాలు నిర్ణయించారు. మహిళల హైజంప్‌లో గతంలో జాతీయ రికార్డు నెలకొల్పిన సహానా కుమారి బసంత్‌కు కోచింగ్ ఇవ్వడం విశేషం. అతడి గత ఉత్తమ ప్రదర్శన 2.11 మీటర్లు కాగా.. సహానా నేతృత్వంలో రాటుదేలిన అతడు పది సెంటీమీటర్లు అధికంగా దూకాడు.

**షానవాజ్‌కు కాంస్యం:**

# అంతా టాక్సికే!



కేజీఎఫ్ స్టార్ యశ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోనప్స్' ట్రైలర్ శనివారం విడుదలైంది. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, తాజాగా విడుదలైన ట్రైలర్‌తో ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలను పరిచయం చేసింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ట్రైలర్‌ను అద్భుతమైన విజువల్స్, రోమాంచితమైన యాక్షన్ సీక్వెన్స్‌లతో ఆకట్టుకునేలా రూపొందించారు. ప్రధానంగా రాయ (యశ్), అతని కుమారుడు టికెట్ మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాన్ని ఇందులో ఆవిష్కరించారు. కథలోని కీలక మలుపులను రహస్యంగా ఉంచుతూనే, "అరాచకం మరో అరాచకాన్ని కలిస్తే ఎలా ఉంటుంది" అనే ఆసక్తికరమైన థీమ్‌ను హైలైట్ చేశారు. నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణీ వసంత్, హుమా ఖురేషీ వంటి భారీ తారాగణం పోషించిన పాత్రలను సైతం ఈ ట్రైలర్‌లో పరిచయం చేయడం విశేషం. కన్నడ, ఆంగ్ల భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిన ఈ చిత్రం, తెలుగు, తమిళం, హిందీ, మలయాళం భాషల్లోకి అనువాదమై విడుదల కానుంది. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. గతంలో ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ఒక లుక్‌లోని శ్మశాన వాటిక సన్నివేశం వివాదాస్పదమై ఎఫ్‌ఐఆర్ కూడా నమోదైన సంగతి తెలిసిందే.



## 104 డిగ్రీల జ్వరంతోనూ అవికాగోర్ షూటింగ్

చిన్నారి పెళ్లికూతురు ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం, జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం.




## 'ఇరుముడి' ట్రైలర్

తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 12న 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది.



## నాని హీరోగా భాగ్యశ్రీ మువీ

అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన 'లెనిన్' సినిమా సక్సెస్‌తో ఫుల్ జోష్‌లో ఉన్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేకి మరో క్రేజీ ఆఫర్ దక్కబోతున్నట్టు తెలుస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'బ్లడీ రోమియో' సిని మాలో భాగ్యశ్రీని హీరోయిన్‌గా తీసుకునే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్టు సమాచారం. అయితే దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రవితేజ హీరోగా వచ్చిన 'మిస్టర్ బచ్చన్'తో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన భాగ్యశ్రీకి వరుసగా క్రేజీ సినిమాలు వచ్చాయి. కానీ ఆశించిన స్థాయిలో విజయాలు మాత్రం దక్కలేదు. 'లెనిన్'తో ఆమెకు తొలి సాలిడ్ హిట్ దక్కింది. ఈ సక్సెస్‌తో భాగ్యశ్రీ ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటోంది.



## చిల్లర వార్తలెందుకు?

బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి మృణాల్ ఠాకూర్ గురించి గత కొంతకాలంగా ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టీమిండియా యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్‌తో ఆమె డేటింగ్‌లో ఉందంటూ నెట్టింట జోరుగా ప్రచారం జరిగింది. అయితే ఈ వార్తలపై తాజాగా మృణాల్ ఠాకూర్ స్వయంగా స్పందించి క్లారిటీ ఇచ్చారు. తనపై వస్తున్న పుకార్లపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఘాటైన సమాధానం ఇచ్చారు. ఇటీవల ముంబైలోని బాంద్రా ప్రాంతంలోని ఓ కేఫ్ నుంచి మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ వేర్వేరు సమయాల్లో బయటకు వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో వీరిద్దరి మధ్య ఏదో సంబంధం ఉందంటూ నెటిజన్లు ఊహాగానాలు మొదలుపెట్టారు. ఇద్దరూ కలిసి కనిపించకపోయినా.. ఒకే ప్రాంతంలో కనిపించడం డేటింగ్ రూమర్స్‌కు కారణమైంది. ఈ వార్తలు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ కావడంతో చివరకు మృణాల్ స్పందించాల్సి వచ్చింది. యశస్వి జైస్వాల్‌తో మృణాల్‌ను లింక్ చేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన ఓ పోస్టుపై ఆమె ఘాటుగా స్పందించారు. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తం చేస్తూ.. అసలు తన పక్కన యశస్వి ఎక్కడ ఉన్నాడో చూపించాలని ప్రశ్నించారు. చదువుకున్న వారు కూడా ఇలాంటి ఆధారాలు లేని వార్తలను ఎలా నమ్ముతున్నారో అర్థం కావడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. దేశంలో ఎన్నో ముఖ్యమైన విషయాలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి పెట్టకుండా ఇలాంటి చిల్లర వార్తలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని సూచించారు.